క్లుప్తంగా

విధులు బహిష్కరించిన న్యాయవాదులు

తిరువూరు: విజయవాడలో న్యాయవాదిపై అక్రమ కేసులు బనాయించారని ఆరోపిస్తూ తిరువూరు కోర్టులో న్యాయవాదులు మంగళవారం కోర్టు విధులు బహిష్కరించారు. వీరవల్లి పోలీసుస్టేషన్లో న్యాయవాది తగరం కిరణ్ బాబుపై బనాయించిన అక్రమ కేసు ఉపసంహరించాలని బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సంకురాత్రి జనార్దనరావు, అంకిరెడ్డి అంజన్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. నిరసన కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

వీఆర్వోలు అందుబాటులో ఉండాలి

వీరులపాడు: వీఆర్వోలు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని తహసీల్దార్ ఆశయ్య నాయక్ పేర్కొన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఆయన వీఆర్వోలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీఆర్వోలు ఆయా గ్రామాలలో ప్రజలకు అందుబాటులో ఉంటూ రెవెన్యూ పరమైన సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. గ్రామ స్థాయిలో పరిష్కారం కాని సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ ఆంజనేయులు పాల్గొన్నారు.

దాతల సహాయంతో ఆస్పత్రిలో మరిన్ని సదుపాయాలు



నూజివీడు: దాతల సహాయంతో పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్. నరేంద్రసింగ్ పేర్కొన్నారు. నూజివీడు ఏరియా ఆస్పత్రికి 2021లో 10 పడకల ఐసీయూ వార్డుకు వెలగపూడి ట్రస్టు నిర్వాహకులు పలు సామగ్రిని ఉచితంగా అందించి వార్డు ఏర్పాటుకు కృషి చేశారని తెలిపారు. ట్రస్టు నిర్వాహకులు మంగళవారం ఏరియా ఆస్పత్రిని సందర్శించి వైద్య సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా ట్రస్టు నిర్వాహకులైన వెలగపూడి రాజ్‌కుమార్ కుటుంబ సభ్యులను సూపరింటెండెంట్ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు ఉపయోగపడేలా సాయం చేయడం వల్ల ఎంతో మానసిక సంతృప్తి లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.


31న ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని ఈ నెల 31వ తేదీ ఉదయం ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ నిర్వహిస్తున్నట్లు దుర్గగుడి ఈఓ భ్రమరాంబ మంగళవారం తెలిపారు. ఆ రోజు తెల్లవారుజాము 5.55 గంటలకు దుర్గగుడి ఘాట్‌రోడ్డులోని కామధేను అమ్మవారి ఆలయం నుంచి గిరి ప్రదక్షిణ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. కుమ్మరిపాలెం, నాలుగు స్తంభాల సెంటర్, సితార, కబేళా, పాలప్రాజెక్టు, చిట్టినగర్, కొత్తపేట నెహ్రూబొమ్మ సెంటర్, బ్రాహ్మణ వీధి మీదగా మహా మండపానికి చేరుతుందని వివరించారు. శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల ఉత్సవ మూర్తులతో పాటు మేళతాళాలు, మంగళవాయిద్యాలు, భక్తజనుల కోలాట నృత్యాల మధ్య గిరి ప్రదక్షిణ జరుగుతుందని తెలిపారు.

రేపు సిద్ధార్థ ఆడిటోరియంలో జానపద గీతాలాపన

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): స్థానిక సిద్ధార్థ ఆడిటోరియంలో ఈ నెల 31వ తేదీ సాయంత్రం 6.30 గంటలకు జానకీరావు బృందంతో జానపద గీతాలాపన కార్యక్రమం జరుగుతుందని ముమ్మనేని సుబ్బారావు సిద్ధార్థ కళాపీఠం అధ్యక్షుడు పాలడుగు లక్ష్మణరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించిన యువజనోత్సవ పోటీల్లో జానకీరావు బృందం నాలుగు సార్లు ప్రథమ స్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారందరూ ఉచితంగానే ఈ ప్రదర్శనను తిలకించొచ్చని సూచించారు.

దుర్గగుడిలో శాస్త్రోక్తంగా ఉదకశాంతి



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో మంగళవారం సాయంత్రం ఉదకశాంతిని శాస్త్రోక్తంగా నిర్వహించారు. బుధవారం నుంచి ప్రారంభమయ్యే పవిత్రోత్సవాలను పురస్కరించుకుని ముందు రోజు ఉదకశాంతి నిర్వహించడం ఆనవాయితీ. మంగళవారం సాయంత్రం ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వర స్వామి ఆలయం సమీపంలోని యాగశాలలో ఆలయ వేద పండితుల మంత్రోచ్ఛరణ మధ్య వైదిక సిబ్బంది ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈఓ భ్రమరాంబ, ఆలయ స్థానాచార్య విష్ణుభట్ల శివప్రసాద్ శర్మ, వైదిక కమిటీ సభ్యులు, అర్చక సిబ్బంది పాల్గొన్నారు.

భాషతోనే మనిషి మనుగడ



తిరువూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గిడుగు చిత్రపటం వద్ద అధ్యాపకులు, విద్యార్థులు

మైలవరం: భాష లేకపోతే మనిషి మనుగడ సాధ్యపడదని ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి తెలిపారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో గిడుగు శ్రీరామ్మూర్తి జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సమస్త జలచర జీవులు నుంచి మనిషిని ఉన్నతునిగా తీర్చిదిద్దిన ఘనత భాషకే దక్కిందన్నారు. తెలుగు శాఖాధ్యక్షుడు డాక్టర్ మెండా దేవానంద్‌కుమార్ మాట్లాడుతూ భాష, భావ పరంపరల సమాహారం అన్నారు. వారోత్సవాల్లో భాగంగా జాతీయ వెబినార్, జాతీయ క్విజ్, రాష్ట్ర స్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలోనూ తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు వివిధ రంగాలలో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

ఘనంగా గిడుగు రామ్మూర్తి జయంతి

రెడ్డిగూడెం: మండలంలోని కూనపరాజుపర్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగుభాషా దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగుభాష ఉపాధ్యాయుడు కె. చంద్రశేఖర్ గిడుగు రామ్మూర్తి జీవిత చరిత్రను తెలుగుభాష గొప్పతనం వివరించారు. కె. చంద్రశేఖర్‌ను ఉపాధ్యాయులు సత్కరించారు. అనంతరం పద్యాల పోటీ విజేతలకు బహుమతులు అందజేశారు.

మాతృభాషను మరవద్దు..

తిరువూరు: మాతృభాష ఎంతో మధురమైందని, తెలుగుభాష ప్రపంచదేశాల్లోనే విశిష్టత కలిగి ఉందని తిరువూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం. సుశీలరావు అన్నారు. మాతృభాషా దినోత్సవ సందర్భంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వ్యవహారిక భాష విశిష్టతపై జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తెలుగు అధ్యాపకుడు చిట్టిబాబును సన్మానించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గిడుగు రామ్మూర్తి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ప్రిన్సిపాల్ మురళీకృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజుపేట ఎంపీయూపీ స్కూల్, శ్రీనిధి, సిద్ధార్థ స్కూళ్లలో మాతృభాషా దినోత్సవం నిర్వహించారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం..

చాట్రాయి: మండలంలోని మర్లపాలెం హైస్కూల్లో మంగళవారం తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు వ్యవహారిక భాష పితామహుడు గిడుగు రామ్మూర్తి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. నూజివీడుకు చెందిన డి. ఉమామహేశ్వరావు విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బక్కయ్య, పీఈటీ డి సతీష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ డాక్టర్ రవి, అధ్యాపకులు

పోలిశెట్టిపాడు జెడ్పీ పాఠశాలలో..

ఏ.కొండూరు: మండలంలోని పోలిశెట్టిపాడు జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం తెలుగుభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు ఏ. రవికుమార్ మాట్లాడారు. విద్యార్థులకు పలు రకాల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందించారు.

ఘనంగా గిడుగు రామ్మూర్తి జయంతి

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): వ్యవహారిక భాషా పండితులు గిడుగు రామ్మూర్తి జయంతి వేడుకలు స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో మంగళవారం ఘనంగా జరిగాయి. రాష్ట్ర ప్రభుత్వ పరీక్షల సంచాలకులు డి.దేవానందరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. భాష చారిత్రిక నేపథ్యం, వికాసం, ఆధునిక కాలంలో తెలుగుభాష వినియోగం వంటి అంశాలపై ప్రసంగించారు. డీపీర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు డి.శ్రీను పాల్గొన్నారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మహాభాష తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మాతృభాషా దినోత్సవం

తిరువూరు రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో మాతృభాషా దినోత్సవాన్ని మంగళవారం జరిపారు. చిట్టేల, కొమ్మిరెడ్డిపల్లి, ముష్టికుంట్ల, లక్ష్మీపురం, ఎరుకోపాడు, చౌటపల్లి, జి.కొత్తూరు, ఎర్రమాడు, మల్లేల గ్రామాల్లోని పాఠశాలల్లో గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.



కూనపరాజుపర్వ జెడ్పీ పాఠశాలలో రామ్మూర్తి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



గిడుగు రామ్మూర్తి చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న అధ్యాపకులు



చిట్టేల ఎంపీయూపీ స్కూల్‌లో రామ్మూర్తి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

సెయింట్ జేవియర్‌లో..

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఇబ్రహీంపట్నంలోని సెయింట్ జేవియర్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో మంగళవారం తెలుగు భాషా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని పలువురు విద్యార్థులు తెలుగు తల్లి, గిడుగు వెంకట రామమూర్తి వేషధారణలో అందరినీ ఆకట్టుకున్నారు. స్కూల్ కరస్పాండెంట్ టి. ప్రవీణ్ ప్రసంగించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ వీ. రంగనాయకమ్మ, అకడమిక్ కో ఆర్డినేటర్ కె. విజయరాజు తదితరులు పాల్గొన్నారు.



పోలిశెట్టిపాడు జెడ్పీ పాఠశాలలో రామ్మూర్తి చిత్రపటంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు



కొండపల్లి జెడ్పీ పాఠశాలలో భువన విజయం రూపకం ప్రదర్శిస్తున్న బాలికలు



ఇబ్రహీంపట్నంలో తెలుగుతల్లి, గిడుగు వేషధారణలో విద్యార్థులు

ధ్యాన్‌చంద్ స్ఫూర్తిగా రాణించాలి



వాలీబాల్ పోటీలు ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు



వాలీబాల్‌పోటీల్లో విజేతగా నిలిచిన నిమ్రా కళాశాల జట్టు సభ్యులు

మైలవరం: మన దేశానికి హాకీ రంగంలో మేజర్ ధ్యాన్‌చంద్ ఎనలేని కీర్తిప్రతిష్టలు తీసుకువచ్చారని ప్రిన్సిపాల్ డాక్టర్ కే. అప్పారావు తెలిపారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో నేషనల్ స్పోర్ట్స్ డేను పురస్కరించుకుని వాలీబాల్, త్రో బాల్, బ్యాడ్మింటన్ పోటీలను మంగళవారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు మాట్లాడుతూ మేజర్ ధ్యాన్‌చంద్ పుట్టిన రోజు సందర్భంగా ఏటా కళాశాలలో అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మేజర్ ధ్యాన్‌చంద్ స్ఫూర్తితో విద్యార్థులు శ్రమించి కృషి చేసి దేశ కీర్తిని ఇనుమడింపజేయాలన్నారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ రాజ్‌కుమార్, ఎస్.దుర్గారెడ్డి, బేబీ రాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం

జూపూడి(ఇబ్రహీంపట్నం): నిమ్రా ఇంజినీరింగ్ కళాశాలలో జాతీయ క్రీడా దినోత్సవ కార్యక్రమం మంగళవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఈనెల 26వ తేదీ నుంచి నిర్వహించిన స్పోర్ట్స్ మీట్‌లో ఎన్టీఆర్ జిల్లాలోని వివిధ కళాశాలల క్రీడాకారులకు వాలీబాల్, త్రోబాల్ పోటీలు నిర్వహించారు. వాలీబాల్ ట్రోఫీని నిమ్రా కళాశాల క్రీడాకారులు, త్రోబాల్ ట్రోఫీని ఆర్కే ఇంజినీరింగ్ కళాశాల క్రీడాకారులు దక్కించుకున్నారు. కళాశాల అకడమిక్ డైరెక్టర్ తమ్మినేని నారాయణమూర్తి గెలుపొందిన జట్లకు ట్రోఫీ అందజేశారు. ప్రిన్సిపాల్స్ అక్బర్‌ఖాన్, జనార్దన్, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ సయ్యద్ సాదత్ ఆలీ, పీడీ సత్తార్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

మైలవరం: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని ప్రధానోపాధ్యాయుడు పి. గోపాల్ తెలిపారు. మైలవరం 6వ వార్డులోని ఎంపీపీ పాఠశాల జాతీయ క్రీడా దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. అదే విధంగా తెలు గు భాషా దినోత్సవాల ముగింపు కార్యక్రమం జరిగింది. ప్రధానోపాధ్యాయుడు గోపాల్ మాట్లాడు తూ మనిషికి విద్య ఎంత అవసరమో క్రీడలు కూడా అంతే అవసరమన్నారు. చిన్నతనం నుంచి మంచి ప్రావీణ్యత సంపాదించాలన్నారు. క్రికెట్, హాకీ, బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్‌లో మన దేశం కూడా ముందుందన్నారు. కార్యక్రమంలో భాగంగా వివిధ క్రీడల్లో పోటీలు నిర్వహించి పీఎంసీ చైర్మన్ పి.మహాలక్ష్మి ద్వారా విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

బడి మానేయొద్దు

విద్యార్థులకు ఎమ్మెల్యే రక్షణనిధి హితవు



తిరువూరు మండలం మునుకుళ్ల జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులతో ముచ్చటిస్తున్న ఎమ్మెల్యే

మునుకుళ్ల(తిరువూరురూరల్): విద్యార్థులు పాఠశాలకు క్రమం తప్పకుండా రావాలని తిరువూరు ఎమ్మెల్యే కె. రక్షణనిధి సూచించారు. మండలంలోని మునుకుళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.80లక్షల నాడు–నేడు నిధులతో నిర్మిస్తున్న భవనాలను మంగళవారం పరిశీలించిన అనంతరం ఎమ్మెల్యే తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. ప్రభుత్వ పాఠశాలల్ని కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దడానికి కృషి జరుగుతోందని, విద్యాప్రమాణాలు కూడా పెంపొందిస్తున్నారని, ఉపాధ్యాయులు విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దాలని సూచించారు. మధ్యాహ్న భోజన పథకం, విద్యార్థులకు యూనిఫాం సరఫరా, ఆన్‌లైన్ తరగతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రధానోపాధ్యాయుడు బి. వీరభద్రరావు, ఉపాధ్యాయులు, గ్రామ సర్పంచి కుమారి, ఎంపీటీసీ వెంకటకృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

భవన నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలి



సమావేశంలో పాల్గొన్న దేశిరెడ్డి

చాట్రాయి: మండలంలోని ఆయా గ్రామాల్లో అసంపూర్తిగా నిలిచిన ప్రభుత్వ భవన నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలని ఏపీ కో ఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి అధికారులకు సూచించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అసంపూర్తి భవన నిర్మాణాలపై సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణాల బిల్లులు ఆలస్యం కాకుండా త్వరితగతిన చెల్లించే విధంగా ప్రభుత్వం కృషి చేస్తోందని కాంట్రాక్టర్లు త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ డీఈ శ్రీనివాసరావు, ఏఈ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

భారీ జాతీయ జెండాతో ర్యాలీ



రమణక్కపేటలో ర్యాలీ ప్రారంభిస్తున్న నేతలు, ఉపాధ్యాయులు



గంపలగూడెం మండలం సత్యాలపాడులో హైస్కూల్లో విద్యార్థుల ప్రదర్శన

ముసునూరు: గ్రామీణ పాఠశాలల నుంచే శాస్త్రవేత్తలు, భాషా కోవిదులు, క్రీడాకారులు తయారు కావాలని జెడ్పీటీసీ సభ్యుడు డా. వరికూటి ప్రతాప్ ఆకాంక్షించారు. భారత చంద్రయాన్–3 విజయం, గిడుగు రామ్మూర్తి పంతులు, హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంత్యుత్సవాలను పురస్కరించుకుని రమణక్కపేట జెడ్పీ హైస్కూల్లో హెచ్ఎం పీవీఎస్ రామకృష్ణ అధ్యక్షతన చిన్నారులకు పోటీలు, భారీ ర్యాలీ కార్యక్రమాలను మంగళవారం నిర్వహించారు. ఇండేన్ గ్యాస్ స్థానిక పంపిణీదారుడు పాలడుగు శ్రీనివాసరావు తయారు చేయించిన 118 అడుగుల మువ్వన్నెల భారీ జాతీయ జెండాతో ర్యాలీని సర్పంచ్ రంగు ధనలక్ష్మి, ఎంపీటీసీ దుర్గాభవాని ప్రారంభించారు. అనంతరం తెలుగు ఉపాధ్యాయులు కొండయ్య, నాగరాజు నాయక్, కృప, పీఈటీ వాకా నాగరాజును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు నామముల లక్ష్మయ్య, ఉప సర్పంచ్ రంగు సత్యనారాయణ, ఎస్ఎంసీ వైస్ చైర్మన్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

తెలుగు భాషకు వన్నెతెచ్చిన మహనీయుడు..

నూజివీడు: తెలుగు భాషకు తద్వారా తెలుగు జాతికి వన్నెతెచ్చిన గొప్ప వ్యక్తి గిడుగు రామ్మూర్తి పంతులని పట్టణంలోని జెడ్పీ బాలికల హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు వీవీఎస్ సత్యనారాయణ అన్నారు. స్థానిక జెడ్పీ బాలికల హైస్కూల్లో మంగళవారం తెలుగు భాషా దినోత్సవాన్ని, జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

గొల్లపల్లి హైస్కూల్లో..

మండలంలోని గొల్లపల్లిలోని జెడ్పీ హైస్కూల్లో మంగళవారం తెలుగు భాషా దినోత్సవాన్ని, జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయులు అక్కినేని రాఘవేంద్రరావు, కలపాల ఏసుపాదంను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో హెచ్ఎం పొట్లూరి రాధికారాణి పాల్గొన్నారు.

ధ్యాన్‌చంద్, రామ్మూర్తికి ఘన నివాళి

రెడ్డిగూడెం: హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ తన క్రీడా ప్రతిభతో ప్రపంచంలో భారతదేశ ఖ్యాతిని వికసింపజేశారని మండలంలోని నాగులూరు విజయబాబు కాలనీ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గార్లపాటి అనుగ్రహ ప్రసాద్ అన్నారు. మంగళవారం పాఠశాలలో తెలుగుభాషా దినోత్సవంతో పాటు క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

ఘనంగా తెలుగుభాష, క్రీడా దినోత్సవం

సత్యాలపాడు(గంపలగూడెం): మండలంలోని సత్యాలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం తెలుగుభాష, క్రీడా దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఎంపీడీఓ వై. పిచ్చిరెడ్డి, ప్రధానోపాధ్యాయులు శేషం రాజు, వ్యాయామ ఉపాధ్యాయులు గుర్రం గోపాలరావు పాల్గొన్నారు. పెనుగొలనులో షిర్డీ సాయిబాబా సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో తెలుగు వాడుక భాష ఉద్యమ పితామహుడు గిడుగు రామ్మూర్తి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. క్రీడాదినోత్సవం సందర్భంగా ప్రముఖ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్‌కు నివాళి అర్పించారు. విశ్రాంత ఎంఈఓ శేషిరెడ్డి, సేవాసమితి సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ధ్యాన్‌చంద్, గిడుగు రామ్మూర్తి చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న అనుగ్రహ ప్రసాద్, విద్యార్థులు



గొల్లపల్లి హైస్కూల్లో విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

మంచి చేస్తున్నాం.. ప్రజల్లో ఉన్నాం..

మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్



మైలవరంలో ఇంటింటికీ తిరిగి పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్

మైలవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రభుత్వంలో ప్రజలకు మంచి జరుగుతుంది కాబట్టే గ్రామాల్లో తిరుగుతున్నామని మైలవరం శాసన సభ్యుడు వసంత వెంకట కృష్ణ ప్రసాద్ తెలిపారు. మైలవరం 3వ నంబర్ గ్రామ సచివాలయం పరిధిలో మంగళవారం రెండో రోజు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గడప గడపకు కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ ఇంటింటికీ తిరిగి జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి సమగ్రంగా వివరించారు. ఆ ఇంటికి ప్రభుత్వ పథకాల ద్వారా అందిన లబ్ధిని వివరించారు. స్థానికుల నుంచి వారి కాలనీల్లో సమస్యలు అడిగి తెలుసుకుని అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సిందిగా సూచించారు. అర్హత ఉండి కూడా ఎవరికైనా సంక్షేమ పథకాలు రాకపోతే వారికి కచ్చితంగా న్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. ముఖ్యమంత్రి జగన్ ఎన్నికల మ్యానిఫెస్టోలో పేర్కొన్న విధంగా నవరత్నాలు పథకాలను సంతృప్తికర స్థాయిలో అమలు చేస్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు సంతృప్తికరంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తీరు మారకపోతే ప్రజలే బుద్ధి చెబుతారు

ముద్దరబోయినపై నూజివీడు వైఎస్సార్ సీపీ నాయకుల మండిపాటు



నూజివీడు సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

నూజివీడు: నియోజకవర్గ ప్రజలు రెండుసార్లు ఓడించి బుద్ధి చెప్పినా టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముద్దరబోయిన వెంకటేశ్వరరావు తీరు మార్చుకోవడం లేదని, రాబోయే రోజుల్లో ప్రజలు మరోసారి బుద్ధి చెప్పడం ఖాయమని వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు శీలం రాము, మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము వెంకటేశ్వరావు, వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనారిటీ విభాగం ఏలూరు జిల్లా అధ్యక్షుడు పిల్లా చరణ్ అన్నారు. వారు స్థానిక ఎమ్మెల్యే ప్రతాప్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ఎమ్మెల్యే మేకా వెంకటప్రతాప్ అప్పారావును ఉద్దేశించి మాట్లాడే అర్హత ముద్దరబోయిన వెంకటేశ్వరావుకు లేదన్నారు. నూజివీడు నియోజకవర్గంలో అభివృద్ధి కేవలం ప్రతాప్ అప్పారావు వల్లనే సాధ్యమైందని అన్నారు. 2014–19 టీడీపీ పాలనలో నూజివీడు నియోజకవర్గంలో ఏమేరకు అభివృద్ధి జరిగిందో చెప్పే ధైర్యం ఆ పార్టీ నాయకులకు లేదని విమర్శించారు. టిడ్కో గృహాల పేరుతో టీడీపీ ప్రభుత్వం దోచుకొని లబ్ధిదారులందరినీ అప్పులపాలు చేసిందన్నారు. అసెంబ్లీ సాక్షిగా నూజివీడును రాజధాని అని ప్రకటించి ఆ తరువాత అమరావతిలో పెట్టినా.. స్థానిక టీడీపీ నాయకులెవరూ నోరు మెదపలేదని అన్నారు. నూజివీడు ప్రాంతానికి టీడీపీ చేసినంత ద్రోహం ఇంకే పార్టీ చేయలేదన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు షేక్ గబ్బర్, ఆరేపల్లి రాంబాబు, క్లోపల్లి ఆదినారాయణ, హరికోటి ప్రసాద్ పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

నూజివీడు: స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని ఈనెల 30న నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ సయ్యద్ అబ్దుల్ రషీద్ మంగళవారం తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణీదుర్గ అధ్యక్షతన ఉదయం 11 గంటలకు కౌన్సిల్ సమావేశ మందిరంలో నిర్వహించనున్న సమావేశానికి కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, సంబంధిత అధికారులు హాజరవ్వాలని కోరారు.

పబ్లిక్ నోటీసు

నా క్లయింటు, ఏలూరు జిల్లా (గతములో కృష్ణాజిల్లా) నూజివీడు మండలం, నూజివీడు పట్టణం, కొన్నంగుంట రోడ్డు, డోరు నెంబరు : 3-95 కాపురస్థులు పాములర్తి వెంకటేశ్వరరావు గారి కుమారుడు పాములర్తి అచ్చేశ్వరరావు గారి సంజాయిషీ పొంది యావన్మందికి తెలియజేయునది ఏమనగా,

నా క్లయింటు ఎన్.టి.ఆర్. జిల్లా, విజయవాడ అర్బన్, కృష్ణలంక, కొత మిషన్ రోడ్డు, ఆదిదేవా ఎన్‌క్లేవ్, ప్లాట్ నెంబరు : 101, డోరు నెంబరు : 41-27-22రు కాపురస్థులైన అన్నా వెంకట రమణారావు గారి కుమారుడు అన్నా వెంకట శ్రీనివాసరావు మరియు ఎన్.టి.ఆర్.జిల్లా, విజయవాడ అర్బన్, బంకింగ్ హామ్ పేట, గవర్నరుపేట, బిగ్ బజారు ఎదురుగా, దుర్గయ్య వీధి, డోరు నెంబరు : 27-19-35 కాపురస్థులైన అన్నా వెంకట రమణారావు గారి కుమారుడు అన్నా వెంకట సత్య వరప్రసాద్ ఆనువారల వద్దనుండి దిగువ షెడ్యూలు దాఖలా స్థిరాస్థిని కొనుగోలు చేయుటకు సిద్ధపడి సదరు కొనుగోలు నిమిత్తం అన్నా వెంకట శ్రీనివాసరావు మరియు అన్నా వెంకట సత్య వరప్రసాద్ గార్లతో అగ్రిమెంటును వ్రాసుకొనియున్నారు.

సదరు దిగువ షెడ్యూలు స్థిరాస్తికి సంబంధించి ఎవరికైనను ఏ విధమైన ఆక్షేపణలు కానీ, క్లయిములు కానీ, కోర్టు లిటిగేషన్లు కానీ వున్న యెడల యీ ప్రకటన వెలువడిన 10 రోజులలోగా యీ దిగువ తెలియజేసిన చిరునామాకు తెలియజేయగలరు. గడువు దాటి వచ్చిన ఆక్షేపణలు నా క్లయింటును బైండు చేయజాలవని యిందుమూలముగా తెలియజేయడమైనది.

షెడ్యూలు: కృష్ణాజిల్లా, ప్రస్తుతం ఏలూరు జిల్లా, నూజివీడు సబ్ రిజిస్ట్రారు వారి యిలాకా, నూజివీడు మండలం, నూజివీడు పట్టణంలోని బస్టాండు రోడ్డులో గల ఆర్.ఎస్.నెంబరు : 463/2 దాఖలా 130 చదరపు గజముల నివేశన స్థలము మరియు అందున డోరు నెంబరు 8-60 (అసెస్మెంటు నెంబరు: 1071002162) గల ఏ.సి.సి. రేకుల ఇంటికి హద్దులు: **తూర్పు:** రోడ్డు, **దక్షిణం** : కొత్త శ్రీనివాస జయచంద్ర గారి యిల్లు, స్థలము, **పడమర** : ధర్మరాజు గారి ఆస్థి, **ఉత్తరం** : బోయపాటి కాంప్లెక్స్.

నూజివీడు, తేదీ :29-08-2023. పల్లగాని రాంబాబు, న్యాయవాది నూజివీడు. సెల్ : 9848158188.